

ఆంధ్రజ్యోతి

5

మంచిర్యాల
జిల్లా వార్తలు
గురువారం 10 అక్టోబరు 2024



పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ కుమార్‌దీపక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 9: సీజన్ పత్తి కొనుగోలు కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సిద్ధం ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అధి కారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో బుధవారం సమీకా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521గా నిర్ణయించిందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. అగ్నిమాపక, విద్యుత్, తూనికలు, కొలతల శాఖల అధికారులు జిన్నింగ్ మిల్లులను సందర్శించి సౌకర్యాలు, ఏర్పాట్లపై నివేదిక అందించాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ పూర్తయిన ఏడు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా సంబంధిత రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం, పత్తి కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చే సమయంలో అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టోకెన్ వ్యవస్థ ఏర్పాటు చేసి వరుస సంఖ్యలు రైతులకు అందించాలన్నారు. నవంబరు రెండో వారం నుంచి పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి రాములు, హరికృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ షాబో ద్దీన్, కాటన్ కార్పొరేషన్, వ్యవసాయ, మార్కెటింగ్, అగ్నిమాపక, రవాణా, పోలీస్, విద్యుత్, ఆబ్కా రీ-మద్యనిషేధ, తూనికలు-కొలతలు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

- నేడు సద్దుల బతుకమ్మ
- పూర్తయిన ఏర్పాట్లు
- మార్కెట్‌లో పూల కొనుగోళ్ల సందడి

మంచిర్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి చిహ్నం, పూలను పూజించే వేడుక బతుకమ్మ పండుగ గురువారంతో ముగియనుంది. ఈ నెల 2న ప్రారంభమైన సంబరాలు నేటితో పూర్తి కానున్నాయి. యేటా భాద్రపద శుద్ధ అమావాస్య రోజు నుంచి తొమ్మిది రోజులపాటు ఆడపడుచులు బతుకమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. మొదటి రోజున ఎంగిలి పడని పూలతో బతుకమ్మ వేడుక ప్రారంభమై తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుం ది. తొమ్మిది రోజులు ఒక్కొక్క రోజు ఒక్కో పేరుతో కొలుస్తారు. బతుకమ్మను ముగ్గురు అమ్మ వార్లయిన గౌరీ, సరస్వతి, మహాలక్ష్మి స్వరూపంగా కొలుస్తారు. అలాగే భాద్రపద శుద్ధ అమావాస్య రోజున పితృ అమావాస్యగా ఆచరించుకుంటారు. కుటుంబంలో మృతి చెందిన పెద్దలకు అమావాస్య రోజున బ్రాహ్మ ణులకు బియ్యాలు ఇచ్చే సంస్కృతి తరతరాల నుంచి వస్తున్నది. కాగా మొదటి రోజు ఎంగిలిపడని పూల బతుకమ్మగా, రెండో రోజు ఆయుష్షునిచ్చే బతుకమ్మ, మూడో రోజు ఆరోగ్య ప్రధాయని, నాలుగో రోజు సిరి సంపదల నిచ్చే బతుకమ్మ, ఐదో రోజు సంతా నాన్ని అందించే బతుకమ్మ పేర్లతో సంబరాలు జరుపుకోగా, ఆరో రోజైన అర్రెం అరిష్ట మైన రోజుగా భావించి బతుకమ్మ వేడుకను నిర్వహించకపోవడం ఆనవాయితీ. ఏడో రోజున పాడి పంటలనిచ్చే బతుకమ్మ, ఎనిమిదోరోజు పసిడి పంటలనిచ్చే బతుకమ్మ, తొమ్మిదో రోజు సకల సౌకర్యాలు, మాంగళ్యాన్నిచ్చే గౌరీ దేవి బతుకమ్మగా కొలుస్తారు.

రోజుకో నైవేద్యంతో..


బతుకమ్మ పండుగలో భాగంగా తొమ్మిది రోజులు రోజుకో తీరు నైవేద్యాన్ని నివేదన చేయడం ఆనవాయితీ. మొదటి రోజు గోధుమలతో, రెండో రోజు వరి ధాన్యంతో, మూడో రోజు కందులతో, నాలుగో రోజు పెసర్లతో, ఐదో రోజు శనగలతో, ఆరో రోజు నువ్వులతో, ఏడో రోజు బబ్బెర్లతో, ఎనిమిదో రోజు మినుములతో నైవేద్యం సమర్పించగా, తొమ్మిదో రోజైన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఉలువలు, నవ ధాన్యాలు, పొడులు, పిండి వంటలు, సద్దులు సమ ర్పిస్తారు. ఆట పూర్తయ్యాక బ్యాండు మేళాలతో మహిళలు బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని సమీపం లోని వాగు, చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంత రం ఐదుగురు చొప్పున మహిళలు ఆ రోజు తయా రు చేసిన పిండి పదార్థాలతో వాయినాలు ఇచ్చు కోవడంతో బతుకమ్మ సంబరాలు ముగుస్తున్నా యి. కాగా చివరి రోజుల అర్ధరాత్రి వరకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు బతుకమ్మ ఆడుతూ ఆనందోత్సాహాలలో మునిగి తేలుతారు.

పూర్తయిన ఏర్పాట్లు..

సద్దుల బతుకమ్మ నిమజ్జన వేడుకలకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని పోచమ్మ చెరువు, రాముని చెరువు, ఏసీసీ, రాళ్లవాగు, గోదా వరి తీరంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాత్రి వేళలో ఇబ్బందులు కలుగకుండా అవసరమైన విద్యుత్ దీపాలను అమర్చారు. అర్ధరాత్రి వరకు నిమజ్జన కార్య క్రమాలు కొనసాగే అవకాశం ఉండడంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.

కరువైన తంగేడు, గునుగు..

బతుకమ్మ వేడుకలకు ఉపయోగించే ప్రధానమైన తంగే డు, గునుగు ఈ ఏడాది ఎదుగుదలలేని కారణంగా మార్కెట్‌లో అందుబాటులో లేవు. తొమ్మిది రోజులుగా మహిళలు ఆయా పూలపై అధికంగా ఆధారపడటంతో ఈ సారి వాటి కొరత ఏర్పడింది. అయినప్పటికీ అక్కడక్కడ లభ్యం అవుతుండటంతో ముందస్తుగానే మహిళలు వాటిని స్వాధీనం చేసుకొని ఇళ్లలోని ఫ్రిజ్‌ల్లో నిలువ చేసుకున్నారు. అయితే సీతమ్మ జడలు, బంతి, చామంతి పూలు మాత్రం మార్కెట్లో పుష్కలంగా లభిస్తున్నాయి. వాటితోనే సరిపెట్టుకోవలసిన పరిస్థితి ఉంది.




మార్కెట్లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

భారీగా పెరిగిన పూల ధరలు..

సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మార్కెట్లో వివిధ రకాల పూలకు విక్రయదారులు భారీగా ధరలు పెంచేశారు. సీతమ్మ జడల పూలకు విపరీతమైన డిమాండ్ నెలకొనడంతో రూ. 100కు మూడు కట్టల చొప్పున (చిన్నవి) విక్రయిస్తున్నారు. అలాగే బంతి, చామంతి పూలు కిలోకు రూ. 200 పైచిలుకు ధరలు పలు కుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో గునగ, తంగేడు పూలు అందుబాటులో లేని కారణంగా మహిళలు మార్కెట్లో లభించే వివిధ రకాల పూలపై ఆధారపడుతుండటంతో విక్రయదారులకు కలిసి వచ్చినట్లయింది.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి టౌన్, అక్టోబరు 9: సింగరేణి కార్మికులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్మికులు వాట్సాప్‌లకు వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. దీని వల్ల వారు లైన్‌లోకి వచ్చి మాయ మాటలు చెప్పి నగదును ఖాజేస్తారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 2 నుంచి 3 లక్షలకు పైగా లాభాల వాటా వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఈ డబ్బుల విషయంలో కార్మికులు జాగ్రత్తగా ఉండాలని సీఎండీ బలరాం సూచించారు. కార్మికులు కష్టపడి సాధించిన నగదును వారి కుటుంబాల ప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకోవా లని కోరారు. గతంలో ఎన్నడు లేని విధంగా సింగరేణి కార్మికులకు లాభాల వాటాను అందజేశామని చెప్పారు. భవిష్యత్‌లో సింగరేణిని ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిపేలా అందరు అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఎండీ కార్మికులతో పాటు కుటుంబ సభ్యులకు బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.





భూ కబ్జాలపై పట్టింపేదీ

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 9: నియోజకవర్గంలో కొంత మంది కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ మాట్లాడుతూ మండలంలోని ఆకెనపల్లి గ్రామ శివారులో సర్వే నంబరు 35లో ప్రభుత్వ అసైన్డ్ భూమిని కొందరు నిబంధనలకు విరుద్ధగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఈ భూమిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు రియల్ వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. అసైన్డ్ భూములను అమ్మరాదు, కొనరాదు అనే నిబంధనలు ఉన్న ప్పటికి పట్టించుకోకుండా అధికార దాహంతో కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, నర్సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

- డీఎస్సీ ఫలితాలల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్


ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నస్పూర్, అక్టోబరు 9: డీఎస్సీ ఫలితాలల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వ ర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందుగా కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పును గౌరవిం చడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వర్గీకరణ చేసిన తరువాతనే ఉద్యోగ నియమాకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చుంచు శంకర్ వర్మ, మంతెన మల్లేష్ మాదిగ, కల్వల శరత్ మాదిగ, మంత్రి మల్లేష్, సుందిల్ల మల్లేష్, ఆటకపురం రాజమల్లు, బానయ్య, గుడిసెల రాజు, సమ్మయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

కలప దుంగలు పట్టివేత

జన్నారం, అక్టోబరు 9: జన్నారం రేంజ్ పరిధిలో గల అల్లినగర్ గ్రామంలో ఆత్రం నగేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 54 వేల రూపాయలు విలువ చేసే టేకు దుంగలను పట్టుకున్నామని డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి తెలిపారు. అనుమతులు లేకుండా నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు

నస్పూర్, అక్టోబరు 9: నస్పూర్ మున్సిపాలిటీలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ అధికార యంత్రాంగం పూర్తి చేసింది. పట్టణంలోని 20 ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. 2వ వార్డు సుభాష్ నగర్ కాలనీ కాలువ వద్ద, 8వ వార్డు తాళ్ళపల్లి చెరువు, 9వ వార్డు ఎస్ఆర్‌పీ గని ఏరియాలో, 13,14 వ వార్డులు నాగార్జు కాలనీ మినీ స్టేడియం, 10 వ వార్డు నస్పూర్ విలేజ్ చెరువులో ఏర్పాట్లు చేశారు. 10వ వార్డు గ్రీన్ సిటీ కాలువ, 10వ వార్డు తోళ్లవాగు ఒర్రె, 12వ వార్డు రైతు కాలనీ చెరువు, 12వ వార్డు పత్రి మల్లన్న స్వామి గుడి సమీపంలో, 15వ వార్డు చర్చి కాలువ, 15వ వార్డు శ్యాంనగర్ కాలువ, 18వ వార్డు ఎస్ఆర్ గార్డెన్ కాలువ, 19వ వార్డు భారతి స్కూల్ సమీపంలోని కాలువ, 19వ వార్డు విలేజ్ శ్రీరాంపూర్ కాలువ, 20వ వార్డు సీసీసీ కార్నర్ రోడ్‌డ్యాం కాలువ, 20వ వార్డు ఫిల్టర్ బెడ్ వద్ద చెరువు, 21వ వార్డు ఆదిపరా శక్తి ఆలయం వద్ద, పునరావాస కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు.

నారాయణ ఆసుపత్రి ప్రారంభం


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ కోటేశ్వర్‌రావు, విశ్వేశ్వర్‌రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 9: పట్టణంలోని గౌతమీనగర్‌లో గల సొంత భవనంలో నారాయణ ఆసుపత్రిని డాక్టర్ కోటేశ్వర్ రావు, విశ్వేశ్వర్‌రావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన మంచిర్యాలలోనే మొట్టమొదటి మహిళ సర్జన్‌గా వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ కళావతి గౌతమీనగర్‌లో ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషకరమన్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ స్థాయిలో మంచి ర్యాలలో అధునిక టెక్నాలజీతో ఆసుపత్రిని ప్రారంభించారని కొనియాడారు. డాక్టర్ కళావతి మాట్లాడుతూ సాధారణ ప్రజలకు తక్కువ ధరలో వైద్యం అందరికీ అందాలనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మల్లేష్, సఖభోగి వెంకటేశ్వర్లు, డాక్టర్ మూర్తి, సల్మాన్‌రాజ్, రాంబాబు, కుమార్, నూతన రవి, రాజ్‌కిర ణ్, అగుమంచి రాణి, స్వరూప రాణి, మెడికల్ అసిస్టెంట్ తొగరి సుధాకర్, మేనేజింగ్ డైరెక్టర్ కాసర్ల యోహన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేతకాని కులస్తులను సంఘటితం చేయాలి

- నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నస్పూర్, అక్టోబరు 9: నేతకాని కులస్తులను సంఘటితం చేయాలని తెలంగాణ నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ అన్నారు. నస్పూర్ పట్టణం ఊరు శ్రీరాంపూర్‌లో బుధవారం నేతకాని కుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం నస్పూర్ పట్టణ కమిటీల నియమించారు. ఈ సందర్భం గా రాజేశ్ మాట్లాడుతూ జైపూర్, భీమారం మండలాలకు హడక్ కమిటీలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నస్పూర్ పట్టణ సంఘం గౌరవ అధ్యక్షుడిగా దాగం దామోదర్, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం శివరాం, ఉపాధ్యక్షులుగా జుమ్మిడి రాములు, జాడి దుర్గ య్యను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా పెరుగు పోశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సల్లూరి పెద్ద రాయలింగు, కార్యదర్శిగా చదువుల రాజం, ప్రచార కార్యదర్శిగా జాడి సత్యనారా యణ, అధి కార ప్రతినిధిగా అంగడి రాజేశ్, కోశాధికారిగా జాడి శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యుల నియమించారు. పట్టణ యూత్ అధ్యక్షు డిగా రత్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చావిడి విఘ్నేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జుమ్మిడి రమేశ్‌ను ఎన్నుకున్నారు. మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలిగా జుమ్మిడి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సల్లూరి మహేశ్వరి,ఉపాధ్యక్షురాలిగా జాడి రాణిలను నియమించారు. కార్యక్రమంలో గోల్ల రాజమల్లు, వనపర్తి రాజేశ్, జాడి తిరుపతి, దుర్గం లింగయ్య, కామెర భానుప్రసాద్, ఆకుదారి రాజలింగు పాల్గొన్నారు.





విద్యారంగంలో అశాస్త్రీయ మార్పులు సరికాదు

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, అక్టోబరు 9: విద్యారంగంలో అశాస్త్రీయ మార్పులు సరికాదని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి రాష్ట్ర బాధ్యుడు టి.లింగారెడ్డి అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటి కరీంనగర్ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగం సమస్యలు సవాళ్లు, కర్తవ్యాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో భాగస్వాములైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, మేధావులు, వివిధ సంఘాలనుండి అభిప్రాయాలు తెలుసుకోకుండా నూతన జాతీయ విద్యావిధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని చూడడం సరికాదన్నారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు అభివృద్ధి చేయకుండా కొత్త కోర్సులు ప్రారంభించకుండా, విద్యారంగంలో అశాస్త్రీయమైన మార్పులు చేపట్టడాన్ని తెలంగాణవిద్యాపరిరక్షణ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, మాడుగుల రాములు, జి ఎల్లయ్య, నారాయణరెడ్డి, కెచంద్రమౌళి, కోల్ రాజ్‌మల్లు, కిషన్‌రావు, తూముల తిరుపతి, ఆర్ చంద్రశేఖర్, సంతోష్‌రెడ్డి, ఎ దామోదర్, చకినాల రాంమోహన్, రాజేశ్వరరావు, చకినాల దేవేందర్, వి పెంటయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరిపాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట, అక్టోబరు 9: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం శివారులో గల 464సర్వే నెంబర్‌లో నాలుగు గుంటల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిపై పోలీస్‌లు బుధవారం కేసు నమోదు చేశారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కాటిపల్లి రాజు అనే వ్యక్తి నాలుగు గుంటల భూమిపై కన్ను వేశాడు. ఎలాగైనా చేజిక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో నకిలీ పత్రాలు సృష్టించాడు. హన్మ కొండకు చెందిన గట్ల రమేష్ అనే వ్యక్తి నకిలీ పత్రాల వ్యవహారంపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, నకిలీ పత్రాలు అని నిర్ధారించి పోలీస్‌లకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 9: జమ్మికుంట మండలానికి చెందిన ఓ మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాపయ్యపల్లి గ్రామానికి చెందిన అంబరగొండ వీరేశంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరం గంటి రవికుమార్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా పురుషుల

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 9: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సాయంత్రం 4:30 గంటలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 9: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్శేడ్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మారం సాయికృష్ణ(25) మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సాయికృష్ణ బుధవారం సాయంత్రం తన బైక్‌పై కరీంనగర్ నుంచి దుర్శేడ్‌కు వెళుతుండగా వెనుకవైపు నుంచి ఒక కారు వచ్చి అతి వేగంగా ఢీకొట్టిందని, దీంతో సాయికృష్ణ తీవ్ర గాయాలతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సాయికృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



మందమర్రిలో పూజలు చేస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రి టౌన్, అక్టోబరు 9: పట్టణంలోని కేకే 5 బంగ్లాస్ సమీపంలో గల పోలేరమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండ‌పంలో బుధవారం సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పూజలు చేశారు. కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు. ఆలయ అర్చకులు కంకణాలు కట్టి కండువాలతో సత్కరించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో బుధవారం నుంచి బెంగాలీల ఆధ్వర్యంలో దుర్గామాతను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ముందుగా మహిషాసురునికి పూజలు నిర్వహించి బెంగాళీల సాంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపడుతారు. రాత్రి సమయంలో జాగరణ చేస్తారు. దసరా రోజున సింధూర పూజ నిర్వహించి రూపాయి బిళ్లతో ఒకొరికొకరు సింధూరం పెట్టుకుంటారు. అనంతరం దేవతా విగ్రహాలను నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు బోడ ధర్మేందర్, రీణాదాస్, కొత్త జయప్రకాష్, అత్తి సరోజ, జూపాక సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కన్నాల జాతీయ రహదారి పక్కన ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా బుధవారం వేద పండితులతో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ జ్యోతి దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గెల్లి రాజలింగు, మల్లరాజు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌పీ3 గనిపై చండీహోమం

శ్రీరాంపూర్, అక్టోబరు 9: శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్‌పీ 3 గనిపై బుధవారం చండీ(శాంతి) హోమం నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ వెంకట్రావు, రక్షణాధికారి మహేందర్, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి దంపతులు హోమం చేశారు. అనం తరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారా మయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, గని అధికారులు, యూనియన్ల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న అధికారులు

జనరల్ మజ్దూర్ కుమారుడికి రెండు ఉద్యోగాలు

శ్రీరాంపూర్, అక్టోబరు 9: సింగరేణిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న కార్మికుడి కుమా రుడికి అదే సంస్థలో రెండు ఉద్యోగాలు వచ్చాయి. నలువాల తిరుపతి-తార దంపతుల కుమారుడు నలువాల మహేందర్ సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్‌లో మైనింగ్ డిప్లొమా చదివాడు. అనంతరం బీటెక్ పూర్తిచేసి ప్రస్తుతం పుణేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సింగరేణి ఉద్యోగ ప్రకటన చూసి మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ(ఎంజీటీ), జూనియర్ మైనింగ్ ఇంజనీర్(ట్రైనీ) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని, పరీక్ష రాశాడు. సెప్టెంబర్ 15న వచ్చిన ఎంజీటీ ఫలితాల్లో 26వ ర్యాంకు, ఈ నెల 7వ తేదీన వచ్చిన జేఎంఈటీ ఫలితాల్లో 2వ ర్యాంకు పొందాడు. కాగా తాను ఎంజీటీగా ఉద్యోగంలో చేరి సివిల్స్‌కు సన్నద్ధమ వుతానని మహేందర్ తెలిపారు. గతంలో జీటీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యిందని, గ్రూప్-1 ప్రిలిమ్స్ అర్హత సాధించి, మెయిన్స్‌కు సిద్ధమవుతున్నానని చెప్పారు. మహేందర్ తండ్రి తిరుపతి ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా పలువురు మహేందర్‌ను అభినందించారు.



మహేందర్

మొదలైన దసరా దమాకా

మందమర్రి టౌన్, అక్టోబరు 9: దసరా దమాకా మొదలైంది.. ఈ నెల 12న దసరా పండుగ ఉన్న నేపథ్యంలో మార్కెట్‌లో దుస్తులతో పాటు ఎలక్ట్రిక్ సామగ్రి ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఇతర వస్తువులను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతాలైన మంచిర్యాల, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లో కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు.వారికి రెండు నుంచి మూడు లక్షల లాభాల వాటా లభించడంతో వస్తువులతో పాటు బంగారం కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 9: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులో అక్ర మంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలానికి చెంది న మహమ్మద్ అబ్రార్‌అలీ జగ్గసాగర్ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని పలువురు వ్యక్తుల నుంచి తక్కువ ధరకు 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించాడు. సేకరించిన బియ్యాన్ని మోర్తాడ్ గ్రామానికి చెందిన అశోక్‌కు చెందిన ఆటోలో నిజామాబాద్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

రెవెన్యూ సేవలను వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



కార్యాలయంలో ఆర్డీవోను కూర్చోబెడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 9: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వేగవంతమైన సేవలు అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో నూతన రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ఆర్డీవో వి.రాములు, ఏసీపీ ప్రకాష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో బాగంగా ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అన్ని ఏర్పాట్లతో నూతన రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో బతుకమ్మ సంబరాలు



బహుమతులను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గర్మిళ్ల, అక్టోబరు 9: పట్టణంలోని రెడ్డికాలనీలో బుధవారం మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు పాల్గొనగా 15 మందిని లక్కీ డ్రా ద్వారా 8 మందిని న్యాయనిర్ణేతలు సూచించిన వారిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులను పంపిణీ చేశారు. మలబార్ గోల్డ్ మేనేజర్ రోషన్ పాల్గొని 10 మంది మహిళలకు రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలమోహన్, కార్యదర్శి కారుకూరి చంద్రమౌళి, ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ సత్తిరెడ్డి, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వి మధుసూదన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ సంజీవ్ పాల్గొన్నారు.

జన్నారం: జన్నారం మండలంలో గల రాంపూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి ప్రణవి కిషోర్‌తో పాటు పాలెపు ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రవాసీలు అమెరికాలోని టెక్సాస్‌స్టేట్‌లోని అస్టిన్ నగరంలో బతుక మ్మ సంబరాలు నిర్వహించారు. యేటా బతుకమ్మ, దసరా సంబరాలు జరుపుకుంటామని తెలిపారు.



ఒక్కచోట చేరిన పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బెజ్జూరు, అక్టోబరు 9:మండలకేంద్రంలో బుధవారం ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో 2010-11బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం

దండేపల్లి, అక్టోబరు 9: మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని బుధవారం తెలంగాణ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ప్రారంభించారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట మార్కె ట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారి వరిసాగు జోరు

- కలిసొచ్చిన వర్షాలు.. యాసంగిపై ఆశలు



సిర్పూర్(టి) నాగమ్మ చెరువులో ఉన్న నీరు

సిర్పూర్(టి), అక్టోబరు 9: మండలంలోని 16 గ్రామపంచాయతీల పరధిలోని 27గ్రామాల్లో ఈ వానాకాలం సీజ్‌లో రైతులు 12వేల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. వర్షాలు సైతం అనుకూలంగా కురవడంతో రైతులకు వరిపంట సాగు దిగుబడి అంచనాలు పెరిగాయి. దీంతోపాటు మండలంలోని ఆయా చెరువులు, కుంటలు నీటితో నిండి ఉన్నాయి. వానాకాలం వరికోతలు అయిన వెంటనే యాసంగిలో సైతం వరి, గోదుమలు, శనగలు వేయడానికి రైతులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పెన్‌గంగా బ్యాకర్‌వాటర్‌తో మండలంలోని టోంకిని, పారిగాం, లక్ష్మిపూర్, వెంకట్రావుపేట గ్రామాల్లో మిర్చీ, వరి, పత్తి, కంది పంటలు నీట మునిగాయి. దీంతో కొంతమంది రైతులు పంటనష్ట పోయారు. వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈసారి ఏదీఏమైనప్పటికీ వరిపంట దిగుబడి భారీగా పెరగనుం దని రైతులు అంచనాలు వేస్తున్నారు. పెట్టిన పెట్టుబ డులతో లాభాలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మౌంట్ పతల్స్ పర్వతాన్ని అధిరోహించిన అన్నాచెల్లెళ్లు

రాయికల్, అక్టోబరు 9: మండంలోని ఆలూరు గ్రామానికి చెందిన లక్కం మణిరాజ్, రిషిత అనే అన్నాచెల్లెళ్లు సోమవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని 14,600 అడుగుల ఎత్తు కలిగిన మౌంట్ పతల్స్ పర్వతాన్ని అధిరోహించారు. శ్రీ చైతన్య డిఫెన్స్, స్పోర్ట్స్ అకాడమీకి చెందిన లక్కం మణిరాజ్ రిషిత ఇంటర్నేషనల్ పర్వతారోహకుడు, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ఫిజికల్ డైరెక్టర్ లెంకల మహిపాల్ రెడ్డి కోచ్ దీకొండ శివరామకృష్ణల ఆధ్వర్యంలో ఎస్ ఫర్ లైఫ్ సే టు నో డ్రగ్స్ అనే థీమ్‌తో పర్వతాన్ని అధిరోహించారు. ఈ పర్వతారోహణకు 12 గంటల సమ యం పట్టిందన్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, భాస్కర్‌రావు, మాజీ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి అభినందించారు.

ధ్రువపత్రాల జారీ గడువులోగా పూర్తిచేయాలి

● కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

కౌటాల, అక్టోబరు 9: వివిధ ధ్రువపత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి గడువులోగా జారీచేయాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. బుధవారం ఆమె మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసిక్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సరస్వతీ అవతారంలో అమ్మవారు



పూజలో పాల్గొన్న కోనేరు చారిటుబల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ

కాగజ్‌నగర్/రెబ్బెన, అక్టోబరు 9: దుర్గా నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం సరస్వతీ మాత అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా పట్టణంలోని సర్‌సిల్క్ పార్కులైన్‌లో చిన్నారులతో సరస్వతీ పూజ నిర్వహించారు. రెబ్బెన ఇందిరానగర్ మహంకాళి ఆలయంలో ఘనంగా దుర్గాదేవి నవరాత్రి వేడుకలు జరుగుతున్నారు. కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి దేవర వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, మొర్లె నారాయణ, సంజయ్‌సింగ్ భక్తులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

కాగజ్‌నగర్, అక్టోబరు 9: పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మశాలిసంఘ సభ్యులు, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజమౌళి, జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల అంజనేయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న పద్మశాలి సంఘం మహిళలు

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

దహెగాం, అక్టోబరు 9: మండలంలోని చిన్నఐనం గ్రామంలోని వ్యవసాయశాఖ గిడ్డంగిని కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీచైర్మన్ సిద్దాల దేవయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిడ్డంగికి ప్రహరీ నిర్మించడానికి నిధులు మంజూరునకు అధికారులను ఆదేశించారు. అనంతరం సిబ్బంది ఆయనను సన్మానించారు. మాజీజడ్పీటీసీ శ్రీరామరావు, మాజీఎంపీపీ సులోచన,సంతోష్‌గౌడ్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 9: మండలంలోని రహపల్లి గ్రామశివారులో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్టుచేశారు. సీఐ సతీష్ తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో పేకాట అడుతున్నారని ముందస్తు సమాచారం మేరకు దాడి చేశాం. ఈ దాడిలో ఏడుగురిలో ఇద్దరు దొరకగా వారిని విచారించి మిగతా ఐదుగురిని కూడా తీసుకు వచ్చి కేసు నమోదు చేశాం. వారివద్ద నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామశివారులో బుధవారం పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈదాడిలో పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. వారినుంచి రూ.409నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల ఏకరువు

పెంచికలపేట, అక్టోబరు 9: మండలంలోని మొర్లిగూడ, కమ్మర్‌గాంగ్రామాల్లో బుధవారం మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు పలుసమస్యలను ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్, డీఈ పృథ్వీ భద్రయ్య,ఏఈలు,ఏపీవో,ఏపీఎం,తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 9:కెరమెరి మండలంలో జోడేఘాట్‌లో ఈనెల 17న నిర్వహించే కుమరం సూరు 27వ వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్ ఆవిష్కరించారు. వర్ధంతి సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్ధంతికమిటీ సభ్యులు రాజు, మారుతి, ధర్ము, మాణిక్‌రావు, లక్ష్మణ్, గంగారాంపాల్గొన్నారు.

ఎస్పీఎం యాజమాన్యం తప్పుడు ప్రకటనలు చేస్తోంది

కాగజ్‌నగర్, అక్టోబరు 9: కాగజ్‌నగర్ ఎస్పీఎం యాజమాన్య ప్రతినిధులు లారీ అసోసియేషన్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు ఆరోపించారు. బుధవారం లారీ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం యాజమాన్యానికి తాము ఇబ్బందులు చేస్తున్నామని పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. లారీఅసోసియేషన్‌కు ఎస్పీఎం యాజమాన్యంతో ఇంతవరకు ఒప్పందం జరగలేదన్నారు.

ఎస్పీఎంతో అథరైజ్డ్ టెండర్లుపొందిన కాంట్రాక్టర్లతో ఒప్పందం జరిగినట్టు వివరించారు. అంతేకానీ యాజమాన్యంతో ఎక్కడాకూడా ఒప్పందం జరుగలేదన్నారు. మిల్లు తమను కేవలం 14 ప్రాంతాలకే పరిమితం చేసిందన్నారు. ఇంకా పెంచాలని తాము డిమాండు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కిషోర్ బాబు

గ్రామ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 9: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జిల్లాపంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.
అధ్యక్షుడిగా మినహాజ్, అసోసియేట్ అధ్యక్షుడుగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా రవీందర్, పద్మ, కార్యదర్శిగా వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శ్వేతారాణి, పబ్లిసిటీ కార్యదర్శిగా ప్రేమలత, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కిరణ్ కుమార్, శ్వేతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- ప్రభుత్వ ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధికరువు
- పట్టించుకోని ఉన్నతాధికారులు..
- ఆందోళనలో కార్మికులు

మూతపడ్డ సీఎఫ్‌సీ



వాంకిడి, అక్టోబరు 9: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మండలకేంద్రంలోని కామన్‌ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ప్రభుత్వ ఆర్డర్లు లేక మూతపడింది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ ఆర్డర్లు లేక వెలవెల బోతోంది. ఈ పరిశ్రమపైనే ఆధారపడ్డ 60మంది కార్మికులు ఆందోళనకు గురవుతు న్నారు. గతేడాది పరిశ్రమ మూతపడి ఉండగా అప్పటి ఐటీడీఏ పీవోగా పనిచేసిన వరుణ్‌రెడ్డి, అదనపుకలెక్టర్‌గా పనిచేసిన చాహత్‌బాజ్‌పాయ్ సీఎఫ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 3లక్షల విలువ చేసే కలప తయారీకి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచుకుంది. అనంతరం బెంగుళూరుకు చెరందిన బెల్(భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) కంపెనీ నుంచి రూ.34లక్షల విలువ చేసే 500డ్యూయల్ డెస్కులు ఆర్డర్ రావడంతో తిరిగి పరిశ్రమ గాడిన పడింది. గతేడాది అక్టోబర్ వరకు పనులు కొనసాగగా అనంతరం ఎలాంటి ఆర్డర్‌లు రాలేదు. అధికారులు దృష్టిసారిస్తే పరిశ్రమకు పూర్వవైభవం రానుంది.

● సీఎఫ్‌సీ ప్రస్థానం..

1971లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో రాష్ట్రంలో 56సీఎఫ్‌సీ(కామన్ ఫెసలిటీ సెంటర్) కేంద్రాలను ప్రారంభించారు. వాంకిడిలో 9వేల రూపాయలతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని కేంద్రాలు మూతపడగా ఆదరణపొందిన ఈ సంస్థ మాత్రమే ఉనికిని చాటుకుని ఇన్నేళ్లు నడిచింది.

● ఫర్నీచర్ తయారీలో కార్మికులు దిట్ట..

కలపతో అందమైన వస్తువులు తయారు చేయడంలో ఇక్కడి కార్మికుల ప్రతిభ అమోఘం. భవనాలకు అమర్చే తలుపులు, కిటికీలు, టేబుల్లు, సోఫాసెట్‌లు, రాకింగ్‌చైర్లు, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, తదితర వస్తువులు తయారు చేస్తారు. వీటి రూపకల్పనలో కార్మికులు తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తారు. కలపతో ఫర్నీచరే కాకుండా ఇనుముతో బీరువాలు, బెడ్‌లు, డ్యూయల్ డెస్కులు తయారుచేస్తుంటారు. ప్రస్తుతం కలప దొరకకపోతుండడంతో ఇనుముతోనే వస్తువులను తయారు చేస్తున్నారు.

● ప్రభుత్వ ఆర్డర్లు లేక కరువైన ఉపాధి..

2012లో పనులు లేక ఈ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. అప్పటి నుంచి జూలై 2015వరకు పరిశ్రమ మూతపడింది. ఆ తరువాత అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ సీఎఫ్‌సీని సందర్శించి పరిశ్రమను పునరుద్దరించే దిశగా చర్యలు తీసుకున్నారు. రూ. 6లక్షల కార్పస్ నిధులను మంజూరి చేసి తిరిగి సీఎఫ్‌సీని పునర్‌ప్రారంభించారు. తరువాత ప్రభుత్వ అర్డర్లు లేకపోవడంతో తిరిగి పరిశ్రమ మూతపడింది. గత ఏడాది అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ రూ. 4.50 లక్షల బెంచిలు తయారు చేసేందుకు ఆర్డర్ ఇవ్వడంతో కొన్ని నెలల పాటు పరిశ్రమ కొనసాగింది. తరువాత ఆర్డర్లు లేక తిరిగి మూతపడింది. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చినట్లైతే సీఎఫ్‌సీకి పూర్వవైభం రానుంది.

ప్రభుత్వ ఆర్డర్లు రావడంలేదు..
- మడావి పైకాజీ, పర్యవేక్షకుడు



సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో ఉపాధి తగింది. గతంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఫర్నీచర్ ఆర్డర్లు వచ్చేవి. దీంతో 60మంది కార్మికులకు ఉపాధి కలిగేది. గతేడాది వరకు అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వడంతో పనులు సాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవడంతో మూతపడింది. సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నాం.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వేను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 9: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వేను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకంలో అనుమతిలేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 7698 దరఖాస్తులు అందాయని ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్, కమీషన్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 9: పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో శిశు, మహిళా, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, దాసరివేణుతో కలిసి హాజరయ్యారు. గౌరమ్మ, శారదాదేవి ప్రతిమలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్రపండుగ అయిన బతుకమ్మ ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిర్పూర్(టి), అక్టోబరు 9: మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని టీవీయూవీ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికేట్ల కోసం వెళ్తే ప్రైవేటు యజమాన్యాలు ఫీజు చెల్లించనిదే ఇవ్వబోమని చెబుతున్నారన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తిచేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 9: పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతోకలిసి కాటన్ కార్పొరేషన్, వ్యవసాయ, మార్కెటింగ్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 23లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 17 జిన్నింగ్ మిల్లులో కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 నిర్ణయించిందని తెలిపారు. అగ్నిమాపక, విద్యుత్, తూనికలు కొలతలశాఖల అధికారులు జిన్నింగ్ మిల్లులను సందర్శించి సౌకర్యాలు, ఏర్పాట్లపై నివేదిక అందించాలని తెలిపారు. మిల్లుల్లో పత్తినిలువలు పేరుకు పోకుండా చూడాలన్నారు. రహదారులకు ఆనుకొని మిల్లులు ఉన్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పత్తి విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, ఇతర మౌళిక వసతులు కల్పించాలన్నారు. కొనుగోలు పూర్తయిన మూడు రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు పత్తి తేమ, నిబంధనలపై విస్తృతప్రచారం చేయాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తనిఖీకేంద్రాలు ఏర్పాటుచేయాలని, నవంబర్ మొదటివారంలో పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి అష్మద్,పత్తి కొనుగోలుకేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 9: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం, సభ్యుడు రాజేశ్వర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పదేళ్లుదాటినా ఉద్యమకారులకు గుర్తింపులేదన్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్ము, రమేష్, మోహీన్, రవీందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి'

వాంకిడి, అక్టోబరు 9: వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని హెచ్‌ఈవో రవిదాస్ పేర్కొన్నారు. బుధవారం బెండార గ్రామంలోని ఉపకేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, పిల్లలకు టీకాలు తప్పని సరిగా వేయించాలని వాటిద్వారా పిల్లలకు, తల్లులకు అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుచరిత, ఏఎన్‌ఎం వసంత తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను బయటపడేయొద్దు: ఎస్సై

కౌటాల, అక్టోబరు 9: మండలకేంద్రంలోని చికెన్‌సెంటర్ యజమానులకు ఎస్సై మధుకర్ బుధవారం పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను బయట పడేయ కుండా కంపోస్టు తయారీకేంద్రంలో వేయాలన్నారు. బయట ఎక్కడోపడేస్తే అనారోగ్యబారిన పడే అవకాశం ఉంటుందన్నారు. షాపులు పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు


ఆసిఫాబాద్‌లో సరస్వతీ దేవి పూజ నిర్వహిస్తున్న విద్యార్థులు


సిర్పూర్(యు)లో అమ్మవారికి కుంకుమార్చన పూజలు

ఆసిఫాబాద్ రూరల్/సిర్పూర్(యు), అక్టోబరు 9: జిల్లా కేంద్రంలో, సిర్పూర్(యు) దేవినవరాత్రిఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 7వరోజు సరస్వతీదేవిఅవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులుపెద్దసంఖ్యలో హాజరైపూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. అన్నదానం నిర్వహిం చారు. ప్రత్యేక నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.



'కార్మికులకు బహుమతులు అందించాలి'

శ్రీరాంపూర్, అక్టోబరు 9: దసరా సందర్భంగా సింగరేణి యాజమాన్యం గనులు, విభాగాలలో కార్మికులకు విందు ఏర్పాటు చేయడం సరికాదని, దానికిబదులుగా బహుమతులు అందించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సందర్భంగా కార్మికులు తమ కుటుంబ సభ్యులతో గడపాలని చూస్తారని తెలిపారు. అలాంటప్పుడు యాజమాన్యం ఏర్పాటుచేసే విందుకు ఎవరు వస్తారని వారు ప్రశ్నించారు. యాజమాన్యం తమ సూచనలను పరిగణలోకి తీసుకొని భోజనాలు పెట్టే కార్యక్రమాన్ని విరమిం చుకోవాలని డిమాండ్ చేశారు.

మందమర్రి టౌన్: యాజమాన్యం విజయదశమి విందు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విందులతో కార్మికులకు ఒరిగేది ఏమి ఉండదని, ఏదైనా కానుక ఇవ్వడం ద్వారా కార్మికులకు గుర్తుండిపోతుందన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పూజలు

శ్రీరాంపూర్, అక్టోబరు 9: సింగరేణిలో పనిచేసే కార్మికుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ బుధవారం ఆర్కే5,7, శ్రీరాంపూర్ సీహెచ్‌పీలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీఎం బి సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి హాజరయ్యారు. ఉద్యోగులు క్షేమంగా ఉండాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే5 గనిపై పూజలు చేస్తున్న జీఎం దంపతులు

రేపు కార్మికులకు విజయదశమి విందు

మందమర్రి టౌన్, అక్టోబరు 9: కార్మికులందరికీ ఈనెల11న యాజమాన్యం విజయదశమి విందు ఏర్పాటు చేస్తోంది. మునుపు ఎన్నడూ లేనివిధంగా మొదటిసారిగా సింగరేణిలో కార్మికులకు యాజమాన్యమే తనఖర్చులతో భోజనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు కలిపి 70వేలమందికి ఈవిందు ఏర్పాటు చేస్తోంది. భోజనాలఏర్పాటుకు సంబంధించి మెనూను కూడా పంపించారు. ఈ విందు ఏర్పాటుపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి ప్రగతికి ప్రభుత్వం చేయూత

మందమర్రి టౌన్, అక్టోబరు 9 : సింగరేణి ప్రగతికి ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు విజయదశమి నాడు ప్రభుత్వం విందు ఏర్పాటు చేయడం మర్చిపోలేనిదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించడం గొప్ప విషయమన్నారు.


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి: జీఎం

మందమర్రి టౌన్, అక్టోబరు 9: బతుకమ్మ ఉత్సవాలకు సింగరేణి పాఠశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏర్పాట్లను ఏరియా జీఎం దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు. బతుకమ్మలను వేసేందుకు వీలుగా తాత్కాలికచెరువు ఏర్పాటుచేశారు. పాఠశాల మైదానంలో విద్యుత్‌దీపాలను అలంకరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. చెరువు వద్ద రెస్క్యూ టీంను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.